సాక్షి
నిర్మల్
బుధవారం । 31 । జూలై । 2024



ఆర్టీసీకి 'మహాలక్ష్మి'

గతంలో ప్రయాణికులు లేక వెలవెలబోయిన ఆర్టీసీ బస్సులు నేడు కళకళలాడుతున్నాయి. మహాలక్ష్మి పథకంతో మహిళల తాకిడి, ఆదాయం పెరిగింది.

10లో▸

ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలు

భైంసాటౌన్: డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూర విద్యావిధానంలో 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భైంసా డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ వి.మధు తెలిపారు. ఇంటర్‌పాసైన విద్యార్థులు ఆగస్టు 18లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 73829 29740 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.3 /25.5

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డితో నారాయణ్‌రావు పటేల్

భైంసాటౌన్: ముథోల్ మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రైతు రుణమాఫీ రెండో విడత సందర్భంగా ఈ మేరకు హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రైతుల రునాలు మాఫీ చేసినందుకు నియోజకవర్గ రైతుల తరఫున సీఎంకు కృతజ్ఞతలు తెలి పారు.

కొనసాగుతున్న 'ఇథనాల్' వ్యతిరేక ఆందోళన



శిబిరంలో కుల సంఘాల నాయకులు, రైతులు

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల నడుమ ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను నిలిపివేయాలని దిలావర్‌పూర్‌లో చేపట్టిన శాంతియుత ఆందళన కొనసాగుతోంది. స్థానిక బస్టాండ్ ఎదుట రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన పలువురు కుల సంఘాల నాయకులు, రైతులు, కుల పెద్దలు దీక్షలో కూర్చుని ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులు సామ కిశోర్ రెడ్డి, కుంట గంగారెడ్డి, కొట్మీర్ గంగారెడ్డి, భీంరావు పాటిల్, ఉద్యమ కమిటీ సభ్యులు సప్పల నర్సయ్య, కోడె విజయ్, ధని నర్సయ్య, తోట రమాకాంత్, కోడె నవీన్ సల్ల మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి దేవేంద్రబాబు

భైంసాటౌన్: విద్యార్థులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, భైంసా కోర్టు న్యాయమూర్తి డి.దేవేంద్రబాబు సూచించారు. పట్టణంలోని స్వామి వివేకానంద అనాథ పిల్లల ఆవాసాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, పరిసరాలు పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని నిర్వహకులను ఆదేశించారు. ఆయన వెంట సీనియర్ న్యాయవాదులు డబ్ల్యూ.భీంరావు, జె.అశోక్, జి.శంకర్, న్యాయవాదులు సోమేశ్ పాటిల్, బోయిడి రఘువీర్, సుమిత్‌సింగ్, కోర్టు సిబ్బంది నజీర్, ప్రశాంత్ ఉన్నారు.

'కడెం'కు తగ్గిన వరద



నిండుగా కడెం ప్రాజెక్టు

కడెం: కడెం ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. దీంతో ప్రాజెక్టు అధికారులు వరద గేటును మూసివేశారు. ప్రాజెక్ట్ పూర్తి నీటిమట్టం 700(7.603టీఎంసీ)అడుగులు కాగా, ప్రస్తుతం 695.500(6.479టీఎంసీ) అడుగులు ఉంది. ప్రాజెక్టుకు ప్రస్తుతం 4,196 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని అధికారులు తెలిపారు.

భైంసా మున్సిపల్ కమిషనర్‌గా రాజేశ్‌కుమార్

భైంసాటౌన్: భైంసా మున్సిపల్ కమిషనర్‌గా బి.రాజేశ్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న రాజేశ్‌కుమార్‌ను భైంసాకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇదివరకు భైంసా మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన వెంకటేశ్వర్‌రావు లంచం కేసులో ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో డీఈఈ సుదర్శన్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. తాజాగా గ్రేడ్–1 మున్సిపల్ కమిషనర్ బి.రాజేశ్‌కుమార్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ బదిలీ చేసింది.

సెల్లార్.. కమర్షియల్!?



బస్టాండ్ ప్రాంతంలోని ఓ భవనం సెల్లార్‌లో కొనసాగుతున్న దుకాణాలు



చైన్‌గేట్ సమీపంలోని సెల్లార్‌లో పర్మిట్‌రూమ్



రవినగర్‌లో ఓ భవనం సెల్లార్‌లో దుకాణాలు

- పార్కింగ్ ప్లేసుల్లో దుకాణాలు
- రోడ్లపై నిలుస్తున్న వాహనాలు
- ముంపు ప్రాంతాల్లోనూ ఇదేకథ..
- ఢిల్లీ ఘటనతోనైనా అధికారులు కదిలేనా?

నిర్మల్: 'తమది పేరుకు జిల్లా కేంద్రమే అయినా.. ఇక్కడ ఏమాత్రం ముందుచూపు లేని పనులు జరుగుతుంటాయి..' అని స్థానిక ప్రజలే ఎద్దేవా చేస్తుంటారు. నిర్మల్‌లో చాలా పనులు కూడా అలాగే ఉన్నాయి. తాజాగా ఢిల్లీలో సెల్లార్‌ను వరద ముంచెత్తడంతో సివిల్స్‌కు ప్రిపేరవుతున్న ముగ్గురు విద్యార్థినులు మృతిచెందారు. ఈ ఘటన యావత్ దేశాన్ని కుదిపేసింది. ఈనేపథ్యంలో నిర్మల్‌లోనూ సెల్లార్‌లను 'సాక్షి' పరిశీలించగా.. ఇక్కడా నిబంధనలకు విరుద్ధంగానే ఉన్నాయి. ఒకట్రెండు మినహా అన్నిచోట్ల పార్కింగ్ సెల్లార్‌లనూ వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు.

షెటర్లు కట్టి.. దుకాణాలు పెట్టి..

పట్టణాలు, నగరాల్లో పార్కింగ్ సమస్యలు రాకుండా ఉండటానికి సెల్లార్లను నిర్మించడం చూస్తుంటాం. టౌన్‌ప్లానింగ్ నిబంధనల ప్రకారం మున్సిపాలిటీల్లో వాణిజ్య భవనాలు కచ్చితంగా పార్కింగ్ ఏరియా చూపించాల్సి ఉంటుంది. నిర్మల్‌లో ఎక్కడా సెట్‌బ్యాక్ అమలు కావడం లేదు. చాలావరకు దుకాణాలు రోడ్డుపైకి వచ్చేశాయి. కొత్తగా నిర్మిస్తున్న భవంతులు కూడా సెట్‌బ్యాక్ పాటించడం లేదు. ఇది చాలదన్నట్లు.. సెల్లార్‌లు నిర్మించి మరీ.. వాటిని పార్కింగ్ కోసం కాకుండా ఆదాయ వనరుగా మార్చుకున్నారు. చాలాచోట్ల షెటర్లను కట్టేసి దుకాణాలకు అద్దెకు ఇచ్చేశారు. కొందరు సొంత అవసరాల కోసం వాడుతున్నారు.

గోదాములుగా..

జిల్లాకేంద్రంలోని ప్రధాన రహదారిపై పేరున్న ఓ వస్త్రాల దుకాణం కింద సెల్లార్ ఉన్నప్పటికీ దాన్ని గోదాము కింద వాడుతున్నారు. దీంతో వినియోగదారుల వాహనాలు, కార్లు రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో పండుగ సమయాల్లో పూర్తిగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. పాత బస్టాండ్‌రోడ్డులోని పలు కాంప్లెక్స్‌లు సెల్లార్లను నిర్మించి వాటిల్లో దుకాణాలు పెట్టాయి. ఈ మార్గంలో వాహనాలన్నీ రోడ్డుమధ్యలో పెట్టడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ముంపు ప్రాంతాల్లోనూ..

నిర్మల్‌ను మూడేళ్లుగా వరదలు ముంచెత్తుతున్నాయి. ప్రధాన వాణిజ్య ప్రాంతాలైన శివాజీచౌక్, ఈద్‌గాం, మంచిర్యాలరోడ్డు, డాక్టర్స్ లైన్ తదితర ప్రాంతాలు నీటమునిగాయి. ఇలాంటి ప్రాంతాల్లో ఉన్న సెల్లార్‌లలోనూ దుకాణాలను నడుపుతున్నారు. శివాజీచౌక్ మధ్యలోనే ఓ లాడ్జి కొనసాగిస్తున్న భవనానికి సెల్లార్ ఉన్నప్పటికీ దాన్ని వినియోగించడం లేదు. ఇక్కడ రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేయిస్తున్నారు. మంచిర్యాలరోడ్డులో శ్మశానం పక్కన గల కమర్షియల్ కాంప్లెక్స్ కింద సెల్లార్ మొత్తం దుకాణాలే ఉన్నాయి. ఈ భవనంలో చిన్నవర్షానికే నీళ్లు వస్తుంటాయి. గతంలో వరదలప్పుడూ నీటమునిగింది. ఢిల్లీలో జరిగిన ఘటన నేపథ్యంలో ఇప్పటికైనా నిర్మల్ మున్సిపల్ అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విజిబుల్ పోలీసింగ్‌తోనే ప్రజల్లో నమ్మకం

- నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి



రికార్డుల నిర్వాహణ తీరును పరిశీలిస్తున్న డీఎస్పీ

సారంగాపూర్: విజిబుల్ పోలీసింగ్‌తోనే ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకం కలుగుతాయని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు పరిష్కారమైన కేసుల వివరాలు, అపరిష్కృతంగా ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ చోరీలు, దొంగతనాలు తదితర వాటికి సంబంధించిన వివరాలను గురించి ఎస్సై శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణతోపాటు శాంతిభద్రతల పరిరక్షణపై ప్రజలకు నమ్మకం కలగాలంటే పోలీసులు విజిబుల్ పోలిసింగ్ విధానం అమలు చేయాలని తెలిపారు. ఇందులో భాగంగా విలేజ్ పోలీస్ అధికారులు పెట్రోకార్, బ్లూకోల్ట్ సిబ్బంది తరచూ గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని తెలిపారు. పెట్రోకార్ 24 గంటలూ గస్తీ నిర్వహించాలని సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను తీర్చాలని సూచించారు. ఇలా చేస్తేనే ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకం ఏర్పడి ప్రతీ నేరానికి సంబంధించిన పూర్తి నిజాలు, వారికి కలిగిన సమస్యలపై ఫిర్యాదులు చేస్తారని తెలిపారు. ఈవిధానంపై దృష్టి సారించాలని సూచించారు. డీఎస్పీ వెంట ఏఎస్సై వసంత్, సిబ్బంది ఉన్నారు.

చెట్ల కొమ్మలు తొలగింపు

సాక్షి స్పందన



కొమ్మల తొలగింపు పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు, నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 20న మున్సిపల్ కమిషనర్ మనోహర్‌తో నిర్వహించిన 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమానికి స్థానిక ప్రజలు పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తెచ్చారు. సాయినగర్‌కు చెందిన రిటైర్డ్ అధికారి గాడుపు రవి అంగడి బజార్‌లోని ప్రధాన రహదారి పక్కన నివాసాలపై ఉన్న విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలను తొలగించి ప్రమాదాలను అరికట్టాలని కోరారు. దీనికి మున్సిపల్ అధికారులు, జాప్రతినిధులు మంగళవారం స్పందించారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యంతోపాటు కమిషనర్, సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి చెట్లకొమ్మలను తొలగించారు. 'సాక్షి' చొరవతో సమస్య పరిష్కారమైందని కాలనీవాసులు తెలిపారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, నాయకులు అమానుల్లాఖాన్, పరిమి సురేశ్, నాయిని సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీతో రైతులకు ప్రయోజనం



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: రుణమాఫీతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. రాష్ట్ర శాసనసభ ప్రాంగణం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అభిలాష అభినవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. రెండో విడత రైతు రుణమాఫీలో భాగంగా రుణమాఫీ చెక్కులను ఆమె రైతులకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత రైతు రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా లక్షా యాభై వేల రూపాయల వరకు రుణాలు పొందిన రైతుల ఖాతాలలో నిధులు జమ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో రెండో విడతలో రుణమాఫీకి సంబంధించి 19,058 మంది రైతులకు రూ 200.17 కోట్లు విడుదల చేయడం జరిగిందని వెల్లడించారు. మొదటి విడతలో 30,105 మంది రైతులకు రూ 171.6 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. మొత్తం రెండు విడతల్లో కలిపి 49,163 మంది రైతులకు రూ 371.93 కోట్లు జమచేసినట్లు తెలిపారు. రుణమాఫీ డబ్బులు పొందని రైతులు మండల వ్యవసాయ శాఖ అధికారులకు తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. రైతు రుణమాఫీలో పేరు రాని, ఖాతాలో డబ్బులు జమ కాని రైతుల సమస్యలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. వీటితోపాటు కలెక్టరేట్‌లోని ఫిర్యాదుల విభాగంలో కూడా తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే రైతు రుణమాఫీ సహాయ కేంద్రం మొబైల్ నంబరు 7288894050లో సంప్రదించడం ద్వారా తమ సందేహాలను, ఇతర వివరాలను తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. రుణమాఫీ విషయంలో బ్యాంకర్లు రైతులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, మండల వ్యవసాయ అధికారులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖర్చుల వివరాలు నమోదు చేయాలి

- అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్



ఎరువుల తయారీని పరిశీలిస్తున్న ఫైజాన్ అహ్మద్

తానూరు: గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేసిన నిధుల వివరాలను రికార్డుల్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్ సూచించారు. మండలంలోని హంగిర్గా, దౌలతాబాద్ గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. నర్సరీల నిర్వహణ, గ్రామ పంచాయతీల నిర్వహణ కోసం ఖర్చుచేసిన నిధుల రికార్డులను పరిశీలించారు. ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎరువుల తయారీ కేంద్రాలు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, ఇటీవల నాటి మొక్కలను పరిశీలించారు. ప్రతీరోజు గ్రామపంచాయతీ ట్రాక్టర్ల ద్వారా తడి పోడి చెత్తను సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీడీవో అబ్దుల్ సమ్మద్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు సాయినాథ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

సాహితీరంగంలో సినారె పాత్ర మరువలేనిది

- సినారె అవార్డు గ్రహీత డాక్టర్ దామెర రాములు
- తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో సినారె జయంతి వేడుకలు



సినారెకు నివాళులర్పిస్తున్న జిల్లా కవులు

నిర్మల్‌ఖిల్లా: సాహితీ రంగానికి జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, తెలంగాణ కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి ఎనలేని సేవలను అందించారని ప్రముఖ కవి, సినారె అవార్డు గ్రహీత డాక్టర్ దామెర రాములు అన్నారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి వేడుకలను తెలంగాణ రచయితల వేదిక జిల్లాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు మాట్లాడుతూ.. డాక్టర్ సి.నారాయణరెడ్డి రచనలు భావితరాలకు మార్గదర్శకంగా ఉంటాయన్నారు. ఆయన రాసిన 'విశ్వంభర' పుస్తకానికి జ్ఞానపీఠ్ పురస్కారం రావడం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. దాదాపు 8 భాషల్లోకి సినారె రచనలు అనువదించబడ్డాయని తెలిపారు. ఆయన 80కి పైగా పుస్తకాలు రచించారని గుర్తుచేశారు. సినీ పరిశ్రమలోనూ తెలుగుదనం ఉట్టిపడే పాటలను అందించారని అన్నారు. ఆయన రచనలు జీవన తాత్వికత గోచరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన కవులు తుమ్మల దేవరావు, నేరెళ్ల హనుమంతు, కామారపు జగదీశ్వర్, అంబటి నారాయణ, కుమ్మరి నాగారం, అంజయ్య, శ్రీరాముల శ్రీనివాస్, సంతోష్ కుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న పాములు

- ఉమ్మడి జిల్లాలో మరణాలు
- ఐదేళ్లలో ఆసిఫాబాద్‌లోనే అధికం
- నాటు వైద్యం, చికిత్సలో జాప్యం
- వానాకాలంలో అప్రమత్తత అవసరం

గత రెండేళ్లలో..

జిల్లా	పాముకాట్లు
మంచిర్యాల	09
నిర్మల్	24



ఖానాపూర్: గోసంపల్లె గ్రామంలో పాముకాటుకు మృతిచెందిన అరుగుల గంగమ్మ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పాముకాటు మరణాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. యేటా వర్షాకాలంలోనే అధికంగా పాములు కాటేస్తుండగా.. కొన్ని చోట్ల బాధితులు ప్రాణాలు కోల్పోతున్నారు. చాలాసార్లు ప్రమాదం నుంచి బయటపడుతున్నా కొన్నిసార్లు ప్రాణముప్పు తప్పడం లేదు. గత రెండ్రోజుల వ్యవధిలోనే మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో ఒకరు, నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం గోసంపల్లికి చెందిన వృద్ధురాలు మృత్యువాతపడ్డారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మరణాల సంఖ్య ఎక్కువగా ఉంది. గత ఐదేళ్లలో 92మందికి కాటు వేయగా, 15మంది చనిపోయారు.

నాటు వైద్యం

ఇంకా కొన్ని ప్రాంతాల్లో పాముకాటు బాధితులు ఆస్పత్రికి వెళ్లడం కంటే మంత్రాలు, తాయత్తులు, చెట్ల ఆకులు, రాళ్ల వైద్యం నమ్ముతున్నారు. కాటేసిన పాములు విషపూరితం కాకపోతే ఎలాంటి ఇబ్బంది ఉండదు. విషసర్పాలు అయితే తప్పనిసరిగా చికిత్స చేయాలి. పాలివీనం, యాంటీవీనం ఇవ్వాల్సి ఉంటుంది. చికిత్స తీసుకోవడంలో జాప్యం, నాటు వైద్యంపై నమ్మకంతో నష్టం జరుగుతోంది.

వానాకాలంలో అధికం

వర్షాకాలంలో పాములపుట్టలు, రంధ్రాల్లో నీరు నిండి విషపురుగులు బయటకు వస్తుంటాయి. ఇంటి పరిసరాలు, వ్యవసాయ భూములు, ఇతర ప్రదేశాల్లో అధికంగా సంచరిస్తుంటాయి. ఉమ్మడి జిల్లాలో నాగుపాము, కట్లపాము, రక్తపింజర, చిన్న రక్త పింజర వంటి విషపూరిత పాములతోపాటు విషరహిత రకానికి చెందిన సరీసృపాలు ఉన్నాయి. పాములు కాటేసినప్పుడు వెంటనే చికిత్స తీసుకోకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.

అప్రమత్తత అవసరం..

అపరిశుభ్ర పరిసరాలతో ఎలుకలు, కప్పలు, పురుగులు వస్తే వాటిని వేటాడి తినేందుకు పాములు వస్తాయని నిపుణలు చెబుతున్నారు. వీలైనంత వరకు చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలి. రాత్రి వేళ, అడవుల్లో సంచరిస్తే బూట్లు వేసుకోవాలి. పాములు కనిపిస్తే శబ్దాలు చేస్తే అక్కడి నుంచి వెళ్లిపోతాయి. పాము కరిస్తే గాయం పెద్దదా, చిన్నదా గుర్తించాలి. ఆ భాగాన్ని ఎటూ కదల్చకుండా జాగ్రత్త పడాలి. ఇలా చేస్తే విషం శరీరంలో మరోచోటికి వ్యాప్తి చెందకుండా కొంతసేపు నిలువరించవచ్చు. కాటేసిన చోట నొక్కుతూ విషం, రక్తం బయటకు వచ్చేలా చూడాలి. ఆందోళన చెందకుండా వీలైనంత త్వరగా ఆస్పత్రికి వెళ్లాలి. ఒత్తిడికి గురైతే రక్తపీడనం పెరిగి నరాల ద్వారా మెదడుకు విషం చేరే ప్రమాదం ఉంది. బాధితులకు ధైర్యం చెబుతూ తగినంత గాలి ఆడేలా చూడాలి. ఏ పాము కాటేసిందో గుర్తిస్తే విరుగుడు చికిత్స సులువు అవుతుంది.

అందుబాటులో ఇంజక్షన్లు

ఉమ్మడి జిల్లాలోని ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ పాముకాటు విరుగుడు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు. సరిపడా నిల్వ అన్ని చోట్ల ఉందని, ఎక్కడైనా కొరత ఉన్నా వెంటనే సర్దుబాటు చేస్తున్నామని తెలుపుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇంకా కొందరు నాటు వైద్యం పైనే నమ్మకంతో ఆసుపత్రికి రావడంలో జాప్యం చేయడంతో మరణాలు సంభవిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

చాలా పాములు విషం లేనివే..

పాముల్లో చాలా వరకు విషం లేనివే. పాములు మనుషుల అలికిడి వింటే దూరంగా వెళ్లిపోతాయి. వాటికి ముప్పు అని భావిస్తే ఆత్మరక్షణకోసం కాటు వేస్తాయి. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి నష్టం జరగదు. మా సొసైటీ తరఫున గిరిజన ప్రాంతాల్లో పాముల సంచారం, వాటి తీరుపై అవగాహన కల్పిస్తాం.
– అవినాశ్, సెక్రెటరీ, ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్‌సొసైటీ హైదరాబాద్

డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి

- ఎస్పీ గౌస్ ఆలం
- ఆర్టీసీ ఉత్తమ డ్రైవర్లకు సన్మానం



ఉత్తమ డ్రైవర్లతో ఎస్పీ గౌస్ ఆలం, రీజనల్ మేనేజర్ సోలోమన్, డిప్యూటీ ఆర్‌ఎంలు

ఆదిలాబాద్: వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. ఆర్టీసీ ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదిలాబాద్ డిపోలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రీజియన్ పరిధిలో ప్రమాద రహితంగా బస్సులను నడిపిన ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రహదారి ప్రమాదాలు అనేవి డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లనే కాకుండా ఎన్నో కారణాల వలన జరుగుతుంటాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని బస్సుల్లో ముందువైపు ప్రత్యేకంగా కెమెరాలు బిగించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పోలీస్‌శాఖ తరఫున రహదారి భద్రతకు సంబంధించి కార్యక్రమాలను పకడ్బందీగా చేపడుతున్నామని తెలిపారు. మరోవైపు ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ రాష్ట్రంలోని ప్రమాద రహిత రీజియన్లలో మొదటి స్థానంలో నిలవడం గొప్ప విషయమన్నారు. ఆర్‌ఎం సోలోమన్ మాట్లాడుతూ.. రీజియన్ పరిధిలో కొన్నేళ్లుగా బస్సు ప్రమాదాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని అన్నారు. ఉద్యోగుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. ఉత్తమంగా నిలిచిన డ్రైవర్లను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఇందులో డిప్యూటీ ఆర్‌ఎంలు ఎస్.ప్రణీత్, కే ప్రవీణ్, పర్సనల్ ఆఫీసర్ జిబ్లా, అకౌంట్ ఆఫీసర్ శంకరయ్య, మంచిర్యాల డిపో మేనేజర్ జనార్దన్, నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, భైంసా డిపో మేనేజర్ హరిప్రసాద్, ఆదిలాబాద్ ఎంఎఫ్ శ్రీకర్, ఆర్‌ఎం ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ కిరణ్‌కుమార్, డిపో సూపరింటెండెంట్ విలాస్ పాల్గొన్నారు.

డ్రైవర్ల సేవలు వెలకట్టలేనివి

నిర్మల్ టౌన్: ఆర్టీసీ బస్సు డ్రైవర్ల సేవలు వెలకట్టలేనివని నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. ఈ నెల 24 నుంచి 30 వరకు నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లోని రీజినల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ డిపో నుంచి రీజినల్‌లోనే ఐదుగురు ఉత్తమ డ్రైవర్లుగా ఎన్నికయ్యారు. రీజినల్ మేనేజర్ సొలోమన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఇందులో అమర్‌సింగ్, మీనాజొద్దీన్, సీబీ.రావు, నర్సయ్య, పరమేశ్వర్ పాల్గొన్నారు.



ఉత్తమ డ్రైవర్లతో నిర్మల్ డీఎం ప్రతిమారెడ్డి

క్లుప్తంగా

పాముకాటుతో వృద్ధురాలు మృతి



అరుగుల గంగమ్మ మృతదేహం

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లెకు చెందిన అరుగుల గంగమ్మ (65)మంగళవారం పాముకాటుతో మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం వృద్ధురాలు నివాసం ఉంటున్న ఇంట్లోనే పాముల పుట్ట ఉంది. పలుమార్లు పుట్టలోంచి బయటకు వచ్చిన పాము పరిసరాల్లో సంచరిస్తూ ఉండేది. సోమవారం ఇంటిని శుభ్రం చేసే క్రమంలో పుట్టవద్ద శుభ్రం చేస్తుండగా నాగుపాము బయటకు వచ్చి వృద్ధురాలిని కాటువేసింది. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి కుమార్తె రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బాసర: మండల కేంద్రంలోని నిజామాబాద్ నుండి భైంసా వెళ్లే ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని న్యాయగాం గ్రామానికి చెందిన లక్ష్మణ్ (46) ద్విచక్ర వాహనంపై న్యాయగాం నుంచి నిజామాబాద్ వెళ్తుండగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గమనించి పోలీసులతో పాటు 108కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

విద్యుత్‌షాక్‌తో విద్యార్థి ..



కార్తీక్ (ఫైల్)

గుడిహత్నూర్: విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గురుజ గ్రామానికి చెందిన దశరథ్, నీలాబాయి దంపతుల కుమారుడు జాదవ్ కార్తీక్ (17) మంగళవారం గ్రామానికి సమీపంలో ఉన్న తమ బంధువుల పంటచేనులోకి వెళ్లాడు. చేనుకు వేసిన కంచె దాటుతుండగా అప్పటికే కంచెపై పడి ఉన్న విద్యుత్ తీగను పట్టుకోవడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

కుక్కల దాడిలో దూడ మృతి

ముధోల్: మండల కేంద్రంలోని మాధవ్‌నగర్‌కు చెందిన నారాయణ్‌సింగ్ దూడ సోమవారం కుక్కల దాడిలో మృతి చెందింది. కొట్టంలో ఉన్న దూడపై రాత్రి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. గేదె అరుపులు విన్న స్థానికులు కుక్కల దాడినుంచి దూడను రక్షించి యజమానికి సమాచారం అందించారు. గ్రామంలో కుక్కల దాడులు ఎక్కువవుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో గల రామాలయం, పోచమ్మ ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. రామాలయంలోని హుండీలో నుంచి రూ.4వేలు, పోచమ్మ ఆలయంలోని హుండీలో నుంచి రూ.7,200 నగదును ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఆయా ఆలయ కమిటీల అధ్యక్షుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఆర్టీసీకి 'మహాలక్ష్మి'

- పథకంతో సంస్థకు పెరిగిన ఆదాయం
- గణనీయంగా పెరిగిన మహిళా ప్రయాణికులు



జీరో టికెట్ తీసుకుని ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థినులు (ఫైల్)



ఆదిలాబాద్ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తున్న మహిళలు, విద్యార్థినులు (ఫైల్)

ఆదిలాబాద్:గతంలో ప్రయాణికులు లేక వెలవెలబోయిన ఆర్టీసీ బస్సులు నేడు కళకళలాడుతున్నాయి. మహిళా ప్రయాణికులను గౌరవిస్తూ, వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళల కోసం ప్రత్యేకంగా సీట్ల కేటాయింపు ఉంది. అయితే వారికి కేటాయించిన సీట్లే కాకుండా బస్సులో 90 శాతం వరకు ప్రస్తుతం మహిళలే ప్రయాణిస్తుండడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలందరికీ ఉచిత ప్రయాణం అందించాలని నిర్ణయించింది. వయసుతో సంబంధం లేకుండా బాలిక నుంచి వృద్ధురాలి వరకు ప్రతి ఒక్కరూ ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. దీంతో ప్రజా రవాణా సంస్థకు మహిళా ప్రయాణికుల తాకిడి పెరగడంతోపాటు, ఆదాయం సైతం పెద్ద మొత్తంలో సమకూరుతోంది.

నిర్మల్ టాప్..

మహాలక్ష్మి పథకం వినియోగానికి సంబంధించి రీజియన్ వ్యాప్తంగా పరిశీలిస్తే నిర్మల్ డిపోలో అధికంగా లబ్ధిదారులు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది జూలై 21 వరకు 1.48 కోట్ల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. డబ్బులు చెల్లించి ప్రయాణించిన వారు 51.59 లక్షల మంది ఉండగా జీరో టిక్కెట్ తీసుకున్న మహిళలు 96.54 లక్షల మంది ఉన్నారు. దాదాపుగా రెట్టింపు సంఖ్యలో మహిళలు ప్రయాణిస్తున్నారు. ఇక మంచిర్యాలలో 78 లక్షలు, ఆదిలాబాద్‌లో 59 లక్షలు, భైంసాలో 56 లక్షలు, ఆసిఫాబాద్‌లో 49, ఉట్నూర్ పరిధిలో 16 లక్షల మంది అతివలు, బాలికలు ప్రయాణం చేశారు. ఇక ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) విషయానికి వస్తే భైంసా డిపోలో అధికంగా 96 శాతం, నిర్మల్‌లో 94 శాతం, ఆసిఫాబాద్‌లో 89 శాతం, మంచిర్యాలలో 88 శాతం, ఆదిలాబాద్‌లో 86 శాతం, ఉట్నూర్‌లో 85 శాతంగా ఓఆర్ నమోదైంది. రీజియన్ పరిధిలో మొత్తంగా 90 శాతం ఓఆర్ నమోదు కావడంతో 'మహాలక్ష్మి ఎఫెక్ట్' అని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

బస్సుల కోసం మరిన్ని విజ్ఞప్తులు..

మహాలక్ష్మి పథకం ప్రారంభం కావడంతో పలు గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు డిపో మేనేజర్లకు వినతి పత్రాలు అందజేస్తున్నారు. గతంలో బస్సులు నిలిపివేసిన రూట్లలో సైతం బస్సులు పునరుద్ధరించాలని డిమాండ్లు వస్తున్నాయి. అదేవిధంగా నూతన మార్గాల్లోనూ సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సైతం విన్నవిస్తున్నారు. దీంతో ఈ దిశగా బస్సుల సంఖ్య పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 2023 డిసెంబర్ 15 నుంచి 2024 జూలై 21 వరకు వచ్చిన ఆదాయం

డిపో	ఆదాయం (రూ.కోట్లలో)	జీరో టికెట్ ఆదాయం (రూ.కోట్లలో)	టికెట్ తీసుకోవడంతో వచ్చిన ఆదాయం(రూ.కోట్లలో)
ఆదిలాబాద్	6.19	2.18	4.39
ఆసిఫాబాద్	4.21	1.66	2.81
భైంసా	3.20	1.74	1.61
మంచిర్యాల	7.44	3.00	4.90
నిర్మల్	7.78	3.43	4.92
ఉట్నూర్	1.36	52 లక్షలు	88 లక్షలు
మొత్తం	30.20	12.55	19.53

ఇబ్బందులు లేకుండా చర్యలు



ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రతీ వంద మందిలో 55 మంది మహిళలే ఉంటున్నారు. రద్దీ, విజ్ఞప్తులు ఉన్న రూట్లలో ఉన్న బస్సు సర్వీసులను అడ్జస్ట్ చేస్తూ నడుపుతున్నాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా ప్రధానమైన రూట్లలో బస్సులు రద్దు చేయకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. బస్సుల్లో రద్దీ పెరుగుతున్న దృష్ట్యా మహాలక్ష్మి ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలి. బస్సులు ఎక్కి, దిగేటప్పుడు హడావుడి పడకుండా నెమ్మదిగా వ్యవహరించాలి.

– సోలోమన్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్

బాలకేంద్రం చిన్నారుల ప్రతిభ



బాలకేంద్రం చిన్నారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాలకేంద్రానికి చెందిన చిన్నారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని వెన్నెల డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక నృత్య పోటీల్లో శాస్త్రీయ, జానపద, వెస్టర్న్ విభాగాల్లో ప్రతిభ కనబర్చారు. కూచిపూడి బృంద నృత్యం, సబ్ జూనియర్స్, సోలో విభాగాల్లో ప్రథమ బహుమతి సాధించారు. మూషికవాహన గీతంపై ఇతీక్ష, మమత గోరేకర్ దేవిస్తుతిపై నృత్య ప్రదర్శన చేసి ప్రథమ స్థానంలో నిలిచారు. నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ బహుమతులు ప్రదానం చేశారు.

మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య



కనక శేఖర్ (ఫైల్)

పెంబి: మద్యం మత్తులో పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని జంగుగూడ గ్రామానికి చెందిన కనక భీంబాయి, సోము దంపతుల మూడో కుమారుడైన కనక శేఖర్ (22) మేకల కాపరిగా పనిచేసేవాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం మేకలు మేపేందుకు వెళ్లనని తండ్రితో చెప్పి మద్యం సేవించాడు. అదే మత్తులో కొట్టంలో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన తండ్రి సోము ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి కనక సోము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ తెలిపారు.

తాంసిలో డెంగీ కేసు నమోదు



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

తాంసి: ప్రజలు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తాంసి హెల్త్ సూపర్‌వైజర్ తులసీరాం సూచించారు. మండల కేంద్రంలో డెంగీ కేసు నమోదు కావడంతో మంగళవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యసిబ్బందితో పాటు పంచాయతీ సిబ్బందితో కలిసి డెంగీ బారిన పడిన వ్యక్తి ఇంటిని పరిశీలించారు. సదరు వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంటి పరిసరాల్లో దోమల మందు పిచికారీ చేయించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి గంగన్న, ఎల్‌టీ రమణాచారి, ఏఎన్‌ఎం లక్ష్మి ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల నుంచి ఫేక్ కాల్

బోథ్: 'మేము హైదరాబాద్ డ్రగ్స్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నాం.. మీ బాబు డ్రగ్స్ కేసులో దొరికాడు. వెంటనే జైల్లో వేస్తాం. మీ బాబును కాపాడుకోవాలంటే వెంటనే రూ.5 లక్షలు పంపాలి.' అంటూ బోథ్ మండల కేంద్రంలోని పలువురితో పాటు పొచ్చెర గ్రామానికి చెందిన ఇద్దరికి సైబర్ నేరగాళ్ల నుండి మంగళవారం వాట్సాప్ కాల్‌లు వచ్చాయి. తమ వద్ద అంతలేవని చెప్పడంతో రూ.50 వేలు గూగుల్‌పే ద్వారా పంపాలని సూచించాడు. పొచ్చెర గ్రామానికి చెందిన వ్యక్తి కుమారుడు ఇంట్లోనే ఉండటంతో వచ్చిన కాల్ ఫేక్ అని సదరు వ్యక్తి గుర్తించాడు. మిమ్మల్ని కలిసి డబ్బులిస్తానని పేర్కొనగా సైబర్ నేరగాడు ఫోన్‌ను వెంటనే కట్ చేశాడు. బోథ్ మండల కేంద్రంలోని పలువురికి ఇలానే ఫోన్లు రావడంతో అప్రమత్తమైన వారు స్పందించలేదు. ఫేక్ కాల్, సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై రాము సూచించారు.

రిజర్వు ఫారెస్ట్‌లో చెట్లు నరికిన ఇద్దరి అరెస్ట్

సారంగాపూర్: మండలంలోని జౌళి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్లు నరికిన ఇద్దరు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు డీఆర్‌ఓ శ్రీదేవి తెలిపారు. గతంలో స్వర్ణ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ పక్కనే గల ఫారెస్ట్ భూమిలో మొక్కలు నాటామని అన్నారు. అయితే ఇందులో తమ సాగు భూములున్నాయని, తాత ముత్తాతల నుంచి తామే పంటలు పండిస్తున్నామని గ్రామానికి చెందిన బండారి సాయన్న, కొత్తపాటి చిన్నగంగయ్య అటవీభూమిలోకి వచ్చి చెట్లు నరికారన్నారు. విషయం తెలుసుకున్న తాము సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి డీఎఫ్‌ఓ ఎదుట హాజరు పరిచామన్నారు. తమ వాళ్లను వదిలేయాలని గ్రామానికి చెందిన సదరు వ్యక్తులు జిల్లా అటవీశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఇదే భూమిలో 14 మందికి పట్టాలు..

ఇటీవల పోడుపట్టాల పంపిణీ సమయంలో పంచాయతీ కార్యదర్శులు, అటవీ శాఖ అధికారులు నిర్వహించిన సర్వే సమయంలో ఇదే భూమిలో గ్రామానికి చెందిన దాదాపు 14 మంది ఫొటోలు దిగి భూమిని సర్వే చేయించారు. సర్వే వివరాలను పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్ చేయగా ఇదే భూమిలోంచి 14 మంది రైతులకు పట్టాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే అప్పటికీ ఏఒక్క రైతు సదరు భూముల్లో సాగుపనులు చేయకపోవడం, అప్పటికే చెట్లు ఏపుగా పెరిగిపోవడం గుర్తించిన అటవీశాఖ అధికారులు సదరు పట్టాలను అప్పటి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నిలుపుదల చేశారని తెలుస్తోంది. ఐ

విభునాయర్‌ను కలిసిన తిరుపతి



పుష్పగుచ్ఛం ఇస్తున్న తిరుపతి

ఇచ్చోడ: తెలంగాణ రాష్ట్ర గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (జీసీసీ) చైర్మన్ కోట్నాక్ తిరుపతి మంగళవారం ఢిల్లీలో మినిస్టర్ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ సెక్రటరీ విభునాయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిజనుల అభివృద్ధికి కేంద్రం నుంచి సహకారం అందించాలని కోరారు. ఇందుకు సెక్రటరీ సానుకూలంగా స్పందించినట్లు తిరుపతి 'సాక్షి'కి వివరించారు.

విద్యారంగంలో కీలక పాత్ర

- ప్రైవేటు పాఠశాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్



మాట్లాడుతున్న మధుసూదన్

నిర్మల్‌ఖిల్లా: విద్యారంగంలో తమవంతు పాత్ర పోషిస్తున్నామని ప్రైవేటు పాఠశాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేలాది మంది నిరుద్యోగులు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తూ ఉపాధ్యాయులుగా ఉపాధి పొందుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆరు వేల ప్రైవేటు పాఠశాలల్లో దాదాపు 32 లక్షల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని, ఇందుకు తాము అందిస్తున్న నాణ్యమైన విద్యనే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్‌రావు, కోశాధికారి పి.రాఘవేంద్రరావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, పట్టణ కార్యదర్శి శ్యాం సుందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో గావ్‌సాత్ పూజలు



పోచమ్మ దేవతకు మొక్కుతున్న గిరిజనులు



గావ్‌సాత్ పూజలకు వెళ్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో గావ్‌సాత్ పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం పొల్లుగూడ, కేస్లాపూర్ ఆదివాసీలు గ్రామ పొలిమేరకు వెళ్లి పోచమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మ దేవతకు పూజలు చేయడం ద్వారా గ్రామానికి ఎలాంటి కీడు రాదని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉంటారని నమ్ముతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు మెస్రం వెంకట్‌రావ్, జుగ్నాక్ మహదు, కోరెంగా లింగు, ఆత్రం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కడెం అడవుల్లో శిక్షణ ఎఫ్‌బీవోలు



కల్పకుంట వాచ్ టవర్ వద్ద శిక్షణ ఎఫ్‌బీవోలు

కడెం: హైదరాబాద్ దూలపల్లి అటవీ అకాడమీకి చెందిన 45 మంది శిక్షణ ఎఫ్‌బీవోలు మంగళవారం కడెం అడవుల్లో పర్యటించారు. మండలంలోని ఉడుంపూర్ అటవీరేంజ్ పరిధిలోని కల్పకుంట వాచ్ టవర్‌ను సందర్శించి, గడ్డి క్షేత్రాలను పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కల్లెడ డెప్యూటీ రేంజ్ అధికారి డి.ప్రకాశ్ వారికి సహజ, కృత్రిమ పద్ధతులతో గడ్డి క్షేత్రాల పెంపకం, అటవీ ప్రాంతంలో పక్షుల రకాలను గురించి వివరించారు. ఎఫ్‌బీవో ప్రసాద్ గడ్డి జాతులు, వాటి పేర్లను వివరించారు. వారి వెంట అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్ (ఏసీడీ) సుభాష్, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

వాగు దాటి.. వైద్య శిబిరం



వాగుదాటి ఉమ్రి చిత్తగూడ వెళ్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించింది. వాగులు వంకలు పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది రాథోడ్ రవీందర్, ఏఎన్‌ఎం శ్రీదేవి, హెచ్‌ఏ వినోద్ వాగు దాటి దాదాపు రెండు కిలోమీటర్లు బురదరోడ్డుపై కాలినడకన వెళ్లి ఉమ్రి చిత్తగూడలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ సీజనల్ వ్యాధులపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సదరు సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాథోడ్ నరేందర్ అభినందించారు.

వివాహిత ఆత్మహత్య



సుజాత (ఫైల్)

బజార్‌హత్నూర్: మండలంలోని గిర్నూర్ గ్రామానికి చెందిన గౌర్ల సుజాత మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మేకల పోసాని పెద్దభూమన్న కుమార్తె సుజాతకు అదే గ్రామానికి చెందిన గౌర్ల అనిల్‌తో 2020లో వివాహమైంది. పెళ్లిలో రూ.7లక్షలు కట్నంగా ఇచ్చారు. కొన్ని రోజులుగా మరో రూ.3 లక్షలు తేవాలని మేలో ఇంటినుంచి పంపించేశారు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగింది. చుట్టుపక్కల వారు గమనించి 108లో రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జలపాతాల్లో జల్సాలకు చెక్



'జలపాతాల్లో జల్సాలు' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు మామడ మండల పోలీసులు వాస్తాపూర్ జలపాతం వద్ద పరిస్థితిని పరిశీలించారు. పర్యాటకులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని మామడ ఎస్సై సందీప్ తెలిపారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

సాక్షి స్పందన

సర్కారు వైద్యం.. వసతి దైన్యం



ఇటీవల కురిసిన వర్షాలతో ఆదిలాబాద్ జిల్లాలో సీజనల్ వ్యాధుల తీవ్రత పెరిగింది. దీంతో జిల్లాలోని పేద ప్రజలకు పెద్దదిక్కుగా నిలిచే రిమ్స్ ఆస్పత్రిలో రోగుల సంఖ్య భారీగా పెరుగుతోంది. దీంతో బెడ్స్ సరిపోకపోవడంతో ఒకే బెడ్‌పై ఇద్దరు ముగ్గురేసి రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఒకరు పడుకుంటే మరొకరు కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యాధుల నయం మాట అటుంచితే కొత్త రోగం సోకే అవకాశం లేకపోలేదు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్